క్లుప్తంగా

మంగపల్లెలో ఉచిత వైద్య శిబిరం



ఓపీ రాయించుకుంటున్న దృశ్యం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నంద్యాల గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ అధినేత డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి ప్రతి నెల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వైద్య శిబిరంలో గుండె, బీపీ, షుగర్, కంటి, ఊపిరితిత్తులు తదితర వ్యాధులకు డాక్టర్లు వైద్య పరీక్షలకు నిర్వహించి అవసరం మేరకు ఉచితం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్స్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి, పెద్దిరెడ్డి, షెక్షావల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరటి చెట్ల నరికివేతపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని మదనంతపురం గ్రామ శివార్లలో ఉన్న కొట్టె శివశంకర్‌రెడ్డికి చెందిన అరటి చెట్లు నరికివేయడంపై కేసు నమోదు చేసినట్లు సీఐ గోపీనాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి, పల్లె రామేశ్వరరెడ్డి మధ్య కొద్ది రోజుల నుంచి పొలం విషయంలో వివాదం నడుస్తుండేది. ఈకోవలోనే ఉదయం రామేశ్వరరెడ్డి భార్య ప్రమీల, ముక్క వెంకటనాథ్‌రెడ్డి 250 అరటి చెట్లు నరికేశారు. వీటి విలువ రూ.70 వేలు ఉంటుందని ఆయన చెప్పారు. ఇద్దరు చెట్లు నరుకుతుండగా అడ్డు పడగా ప్రమీల చేతితో కొట్టింది. తర్వాత ఇద్దరు కలిసి చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ చెప్పారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రమాకాంత్ రెడ్డి, తిరుపాల్ రెడ్డి

అవుకు: మండల పరిధిలోని లింగంబోడులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం గుండ్లశింగవరం సర్పంచ్ కాటసాని రమాకాంత్ రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. లింగంబోడులో రూ.5లక్షలతో చేపట్టిన శుద్ధజల కేంద్రం, రూ.10లక్షలతో శ్రీరాముల ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాల ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రేవంత్ కుమార్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న రేవంత్ కుమార్

బేతంచెర్ల: పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందగడ్డల మోహన్ రావు కుమారుడు కందగడ్డల రేవంత్‌కుమార్ బాంబే ఐఐటీలో జరిగిన 62 పట్ట భద్రుల సమావేశం సివిల్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన సందర్భంగా డాక్టరేట్ అందుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఇన్‌ఫెలోస్టేట్ యూనివర్సిటీ న్యూయార్క్ సతీష్ కె త్రిపాఠి హాజరై డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టరేట్ అందుకున్న రేవంత్ కుమార్‌కు ఆర్యవైశ్యులు, పట్టణ వాసులు అభినందనలు తెలిపారు.

పెద్దమ్మ ఆలయాభివృద్ధికి రూ.3లక్షల విరాళం



నగదు అందజేస్తున్న దాత ఈశ్వరయ్య

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన శ్రీ పెద్దమ్మ ఆలయాభివృద్ధి కోసం ఆళ్లగడ్డ మండలం నర్సాపురం గ్రామానికి చెందిన ఈశ్వరయ్య ఆయన సతీమణి జాహ్నవీలు కుటుంబ సభ్యులు రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. దాత నర్సాపురం గ్రామానికి చెందిన శంకరయ్య, చిన్న పుల్లమ్మ దంపతుల కుమారుడు ఈశ్వరయ్య పెద్దమ్మ తల్లి పై ఉన్న భక్తితో ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన్నట్లు తెలిపారు. ఈమేరకు కమిటీ సభ్యులు దాతకు ప్రత్యేక కృజ్ఞతలు తెలిపారు.

టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా క్రాంతికుమార్

డోన్ రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్‌బాడీ ఎలక్షన్స్ ఆదివారం విజయాడలో జరిగాయి. డోన్ మోటార్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ జాయింట్ సెకరెటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం

- అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు
- సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి
- ఘనంగా స్వాగతం పలికిన యనకండ్ల గ్రామస్తులు

బనగానపల్లె రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని యనకండ్ల గ్రామం ఎస్సీ కాలనీ, మెయిన్ బజారు కాలనీల్లో రూ.41లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను జెడ్పీ చైర్మన్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు యనకండ్ల గ్రామ ప్రజలు ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అడుగడుగునా జనం నీరాజనం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో రెండేళ్లు కరోనా కారణంగా రాష్ట్రాన్నికి ఎలాంటి ఆదాయం లేకున్నా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికంగా అభివృద్ధి చెందారని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్య మంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బనగానపల్లె నియోజకవర్గాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నా., టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డికి మాత్రం కనిపించవని ఎద్దేవా చేశారు. బనగానపల్లె, కోవెలకుంట్ల పట్టణంలో ఫోర్స్‌లైన్ సెంటర్ లైటింగ్ సిస్టంతో పాటు పలు కాలనీల్లో సీసీ రోడ్లు వేయడం జరిగిందని, బనగానపల్లె పట్టణంలో రూ.22 కోట్లతో వందపడకల ఏరియా వైద్యశాల నిర్మాణం పూర్తయిందన్నారు. బనగానపల్లె పట్టణంలో సుమారు 3వేలకుపైగా పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి తాను చర్యలు తీసుకుంటే ఓర్వలేని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ కోర్టు ద్వారా నిలిపివేయడంతో పేదల సొంత ఇంటి కళను తాత్కాలికంగా ఆగిపోవడం జరిగిందన్నారు. త్వరలో కోర్టు ద్వారా తీర్పు రాగనే పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ చేస్తామన్నారు. టీడీపీ నాయకులు ఎన్నికలు సమీస్తుండడంతో కుట్రరాజకీయాలకు పాల్పడుతూ మోసపూరిత హామీలు గుప్పిస్తున్నారని విమర్శించారు. టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా కాటసాని కోరారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసానితిరుపాల్‌రెడ్డి, యాగంటి ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోడూరు రామ చంద్రారెడ్డి, నాయకులు బొబ్బలమహేశ్వరరెడ్డి, సాధుల శివశంకర్‌రెడ్డి, బీసీ రాజశేఖర్‌రెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఎన్ సాంబశివారెడ్డి, వడ్డె వెంకటేశ్వర్లు, సంజీవ్‌గౌడ్, బి.మద్దిలేటి రెడ్డి, ఏ రామకృష్ణ, మస్తాన్ యాదవ్, గోపాల్ నాయుడు,శ్రీను,భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

పొత్తుల జిమ్మిక్కులు పారవు....

టీడీపీ అధినేత చంద్రబాబు నాయకుడు ఓటమి భయంతోనే పొత్తులకు వెంపర్లాడుతున్నారని జెడ్పీ



సీసీ రోడ్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఎద్దేవా చేశారు. బాబు కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, పొత్తులు, జిమ్మిక్కులు పారవన్నారు. చంద్రబాబునాయుడు ఎన్ని పార్టీలతో కలిసి ఎన్నికల్లో పోటీ చేసినా...బాబును ఈసారి ప్రజలు శాశ్వతంగా ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గత టీడీపీ పాలన... ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ పాలన తీరును సరిచూడాలని కోరారు. మీ కుటుంబానికి జగనన్న పాలనలో మంచి జరిగిందా.. లేదా అని ఓ క్షణం ఆలోచించి ఓటు వేయాలని... వైఎస్సార్ సీపీని మరోమారు ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

బనగానపల్లె రూరల్ : యనకండ్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. జనం పెద్దఎత్తున రావడతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నాయకులు, గృహ సారథులు, బూత్ కన్వీనర్లు సమన్వయంతో పని చేసి మంచి మెజార్టీ తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తేవాలని, వెంటనే పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.



యనకండ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్లకు సంబంధించి విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ఆల్వకొండ, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె, ముదిగేడు, కానాల, రెడ్డిపల్లె తదితర ఫీడర్ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరుకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

నేడు శివపార్వతుల కల్యాణం

డోన్ రూరల్ : స్థానిక వైఎస్ఆర్ నగర్‌లోని శివాలయంలో సోమవారం శివ మాలాధారులచే శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త నాగార్జునగౌడ్ తెలిపారు. వేకువజామున స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు. స్వామివారి కల్యాణం అనంతరం భక్తులకు కొచ్చెర్వు శివరామమూర్తి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం పట్టణ పురవీధుల గుండా శివ పార్వతులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు.

నేడు ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

కొలిమిగుండ్ల : బనగానపల్లె పట్టణంలోని కొండపేట సమీపంలోని కొట్నాల శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఆదివారం కొలిమిగుండ్లలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని ఆలయ కమిటీ అధ్యక్షుడు గాధంశెట్టి రవికుమార్, సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం గాధంశెట్టి రవి కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని సహకారంతో ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి మొదటి విడతలో రూ.2కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. దశల వారీగా టీటీడీ నుంచి రూ.6కోట్లు మంజూరవుతాయన్నారు.



జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న కమిటీ సభ్యులు

భూమి పూజకు బనగానపల్లె, పాణ్యం ఎమ్మెల్యేలు

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని కొండపేటలోని పురాతన లక్ష్మీవేంకటేశ్వరస్వామి పునర్నిర్మాణానికి సంబంధించి సోమవారం నిర్వహించే భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బనగానపల్లె, పాణ్యం ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారని ఆలయ పునరుద్దరణ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే పూజ కార్యక్రమాల్లో వారు పాల్గొంటారని, అనంతరం భూమిపూజ చేస్తారన్నారు.

కిడ్నీ బాధితుడికి వీల్ చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న యాగంటి ఆలయ మాజీ చైర్మన్ దొనపాటి యాగంటిరెడ్డి

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలోని భానుముక్కల పింజరిపేటకు చెందిన ఖాజాహుస్సేన్ అనే కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆదివారం యాగంటి ఆలయ మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త దొనపాటియాగంటిరెడ్డి సొంత నిధులతో వీల్‌చైర్ అందజేశారు. ఈ సందర్భంగా యాగంటిరెడ్డి మాట్లాడుతూ ఖాజా హుస్సేన్‌కు రెండు కిడ్నీలు పాడైపోయి నడువలేనిస్థితిలో ఉన్నట్లు నా స్నేహితుడి ద్వారా తెలిసిందని, తనవంత సహకారంగా వీల్‌చైర్‌ను అందజేసినట్లు తెలిపారు. దివ్యాంగులకు ట్రై సైకిల్ అవసరం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పూల అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ

డోన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రతి ఆదివారం చేపట్టే పౌష్టికాహారం కొనసాగింది. గర్భిణులు, బాలింతలతోపాటు రోగులకు ప్రార్థన సమయం సంస్థ నిర్వాహకులు జాన్ ప్రభాకర్ రొట్టె, గుడ్డు, పప్పు అందజేశారు. ప్యాపిలి మండలం బావిపల్లెకు చెందిన రెడ్డి జనార్ధన్ ఆర్థిక సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రార్థన సమయం సభ్యులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందజేస్తున్న జాన్ ప్రభాకర్

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

బనగానపల్లె రూరల్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన గ్రూప్–2 పరీక్ష మండల కేంద్రం బనగానపల్లె పట్టణంలో ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ఏపీ మోడల్ స్కూల్‌లో పాటు వాసవీ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 780 మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాయాల్సి ఉండగా 139 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు పరీక్షల కేంద్రాల చీఫ్ అధికారులు రామకృష్ణ, రామలక్ష్మీ, సురేంద్రారెడ్డి తెలిపారు. పరీక్షల ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగింది. డిపార్ట్‌మెంట్ అధికారులుగా ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ తిరుపతయ్య వ్యవహరించారు.

డోన్ టౌన్ : గ్రూప్–2 ప్రిలిమ్స్ పరీక్షలు పట్టణంలో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. శాంజ్యో ఇంగ్లిష్ మీడియం స్కూల్, నారాయణ, శ్రీసుధ స్కూల్‌లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు జరిగాయి. మొత్తం 640 మంది అభ్యర్థులకు గాను 242మంది గైర్హాజరైనట్లు ఆర్డీఓ మహేశ్వరరెడ్డి తెలిపారు.

వంతెన కష్టాలకు చెక్!

- రూ. 40 లక్షలతో కుందరవాగుపై కల్వర్టు నిర్మాణం
- శరవేగంగా కొనసాగుతున్న పనులు
- రెండు గ్రామాల ప్రజలకు తీరనున్న కష్టాలు



కుందరవాగుపై చురుగ్గా సాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులు

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల– భీమునిపాడు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కుందరవాగుపై కల్వర్టు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వంతెన లేకపోవడంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు వెళ్లేందుకు ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు కంపమల్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లేకపోవడంతో భీమునిపాడుకు రావాల్సి ఉంది. వాగు ఉన్న మార్గాన రాకపోకలు సాగించాల్సి ఉంది. వర్షాకాలంలో వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఈ మార్గాన రాకపోకలు సాగించేందుకు అస్కారం లేకపోవడంతో కంపమల్ల మెట్ట మీదుగా సుమారు 5 కిమీ నడిచి వెళ్లి పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఏడాదిన్నర క్రితం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వాగుపై వంతెన లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వాగుపై కల్వర్టు నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఇటీవల చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. వీటినెంత త్వరలో పనులు పూర్తి కానుండటంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, విద్యార్థులకు ఎళ్లతరబడి నెలకొన్న వంతెన కష్టాలు తీరిపోనుండటంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

శంకరాపురంలో భజన పోటీలు

బేతంచెర్ల: మండల పరిధిలోని శంకరాపురంలో నూతన రామ మందిరం, సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని భజన పోటీలు నిర్వహించారు. పర్దీపురం మారుతి భజన మండలి మొదటి బహుమతి కైవసం చేసుకోగా లక్ష్మంపల్లె శివ రామాంజనేయ రెండవ, గుర్రంపాడు లక్ష్మి నరసింహ మూడవ బహుమతి పొందారు. అదేవిధంగా పర్దీపురం మల్లికార్జున, ఆలం కొండ అన్న పూర్ణ భజన సంఘం సంయుక్తంగా నాల్గవ, సీతారామాపురం సంఘం ఐదవ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు వరుసగా రూ. 25 వేలు, రూ. 20 వేలు, రూ. 18 వేలు, రూ. 27 వేలు, రూ. 10 వేలు చొప్పున బహుమతులను అందజేశారు.

29న దివ్యాంగుల సింహగర్జన

బేతంచెర్ల: కర్నూలు పట్టణంలోని ఎస్టీబీసీ కళాశాలలో ఈనెల 29న చేపట్టనున్న దివ్యాంగుల సింహగర్జన సభను విజయవంతం చేయాలని స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సంస్థ మండల అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, రామ్ మోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో ఆ సంస్థ కార్యాలయంలో సింహగర్జన సభకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో సభ్యులు రాముడు, చంద్రశేఖర్, రామాంజనేయులు, శకుంతల, మద్దమ్మ, లక్ష్మి, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- ఏడుగురికి రూ11.46 లక్షల చెక్కులు అందజేత

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. మండలానికి చెందిన ఏడుగురు ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం చేసుకొని ఆర్థిక సాయం కోసం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సిఫారసుతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సిమెంట్ నగర్‌కు చెందిన కండ్ల పల్లి షారన్ ఏంజల్‌కు రూ. 5లక్షలు, బేతంచెర్ల పట్టణానికి చెందిన కుంచా లక్ష్మమ్మకు రూ. 3.20 లక్షలు, ఆర్ఎస్ రంగాపురం నాగమద్ది నాగేశ్వరరావుకు రూ. 2లక్షలు, బేతంచెర్ల రాయపాటి వెంకట రామిరెడ్డికి రూ. 55 వేలు, దూదేకుల అనిల్ బాషాకు రూ. 28 వేలు, గుండా సురేష్ బాబుకు రూ. 25 వేలు, గోర్లగుట్ట మద్దమ్మకు రూ. 18 వేలు మంజూరు అయ్యింది. ఈ మేరకు ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో లబ్దిదారులకు ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్ చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, డక్కి శేఖర్, సుధాకరప్ప, బుగ్గన గోపాల్ రెడ్డి, మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

హెచ్ఐవీని నిర్మూలించాలి

డోన్ : హెచ్ఐవీ, సుఖ వ్యాధులను సమూలంగా నిర్మూలించేందుకు ప్రజలకు సంపూర్ణంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మధుకుమార్ అన్నారు. స్థానిక పాతబస్టాండ్‌లో హెచ్ఐవీ/ఎయిడ్స్, సుఖ వ్యాధుల నివారణతో పాటు రక్త దానం గురించి జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ సహకారంతో కళాకారులు మంజుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం అవగాహన కల్పించింది. రక్త దానం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవీ, ఎయిడ్స్ సోకే విధానం, వాటి నివారణ మార్గాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బృందం సభ్యులు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు సరస్వతి, షాజాహాన్, సలీమా, వనీత, బాషా, ఆంజనేయులు పాల్గొన్నారు.



హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ప్రభుత్వ భవనాలు ముస్తాబు!



రూ.38.50 లక్షలతో నిర్మించిన సచివాలయం



రూ. 23.94 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్బీకే

- పసుపల గ్రామ పంచాయితీలో రూ.3కోట్లతో అభివృద్ధి పనులు
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: మండలంలోని పసుపల గ్రామ పంచాయితీ పరిధిలో రూ. 3 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఈ మేరకు అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభిస్తారని సర్పంచ్ మోహన్‌బాబు తెలిపారు. పసుపులలో రూ.88.13 లక్షలతో బహుళ ప్రయోజన సౌకర్య గోదాం(గిడ్డంగి), రూ.38.50 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. అలాగే పెద్ద రాజుపాలెం నుంచి కాలేనాయక్ తండా వరకు రూ.68 లక్షలతో బీటీ రోడ్డు, పెద్ద రాజపాలెం, చిన్న రాజుపాలెంలో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.

27నుంచి చౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని రాఘవరాజుపల్లె గ్రామ శివార్లలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరి దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు రామయ్యస్వామి ఆదివారం తెలిపారు. వేదపండితుల ఆధ్వర్యంలో మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, అభిషేకం, చండీహోమం తదితర ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని వివరించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారి విగ్రహ ప్రతిష్టను తిలకించాలని కోరారు. అదేవిధంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు.

మహానందిలో వసతి గదులు ఫుల్

మహానంది: మహానందిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొనడంతో దేవస్థానానికి చెందిన వసతి గృహాలు నిండిపోయాయి. దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న టీటీడీ, నాగనంది సముదాయాల్లో ఉన్న గదులు నిండిపోవడంతో భక్తులు ప్రైవేటు వసతి గృహాల వైపు వెళ్లాల్సి వచ్చింది. కొందరు లాడ్జీల నిర్వాహకులు పోలీసుల నిబంధనలు పట్టించుకోకుండా అధిక మొత్తంలో వసూలు చేసినట్లు విజయవాడ, గుంటూరు ప్రాంతాల భక్తులు వాపోయారు. లాడ్జీల వద్ద గదుల ధరల బోర్డులు ఏర్పాటు చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేశారు. రెండు తెలుగురాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.